క్లుప్తంగా

ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి బాధ్యతల స్వీకరణ



ములగాడ తహసీల్దార్ తారకేశ్వరికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న డీటీ,ఆర్‌ఐ తదితరులు

మల్కాపురం: ములగాడ తహసీల్దార్‌గా జె.తారకేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు డీటీ నాగలక్ష్మి,ఆర్‌ఐ రమేష్‌నాయుడు,వీఆర్వో చంద్రరావు,సర్వేర్ ముద్దుకృష్ణ,జూనియర్ అసిస్టెంట్ కుమారి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం విధుల్లో చేరిన తహసీల్దార్ పేరు పేరునా సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. మండల పరిధిలో ఉన్న సమస్యలను, ఇతర వివరాలను వారి నుంచి సేకరించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



గుర్తు తెలియని వృద్ధురాలి మృత దేహం

గోపాలపట్నం: గోపాలపట్నం సప్తగిరి పెట్రోల్ బంక్ సమీపంలో ఫిష్ మార్కెట్ భవనం వద్ద గుర్తు తెలియని (60) ఏళ్లుగల వృద్ధురాలు సోమవారం మధ్యాహ్నం సమయంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకని వివరాలు సేకరించారు. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో యాచన చేసుకుని జీవిస్తోంది. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎవరైనా గుర్తిస్తే గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మానసిక దివ్యాంగురాలికి వైద్యసేవలు



దివ్యాంగురాలిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న మానసిక దివ్యాంగురాలికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కరాస ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ మహిళ ఉంటుందని సమాచారం తెలుసుకున్న మమత ఎయిర్‌పోర్టు పోలీసుల సహకారంతో అక్కడికి వెళ్లి ఆమె వివరాలు తెలుసుకున్నారు. కానిస్టేబుల్ రామలక్ష్మి సాయంతో ఆస్పత్రిలో చేర్పించి ఆమెకు వైద్యం చేయించారు. కోలుకున్న తర్వాత ఆమెను కుటుంబీకులకు అప్పగిస్తామని మమత తెలిపారు.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డే సందర్భంగా సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కోరాడ శ్రీను విద్యార్థులకు పండ్లు,నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఎస్.ప్రకాష్,పి.వి జయ్‌కుమార్,ఎ.రామలింగరావు పాల్గొన్నారు.

అండర్-16 విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్: అండర్ 16 మల్టీడే అంతర జిల్లాల మ్యాచ్‌ల ఫైనల్‌లో విశాఖ జట్టు 433 పరుగుల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన తుది పోరులో కృష్ణా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు ఏడు వికెట్లకు 456 పరుగుల చేసింది. శ్రావణ్ 113, రోహన్ 151 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా ఈశ్వర్ 87 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ సాయి సాత్విక్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కృష్ణా జట్టు 148 పరుగులకే ఆలౌటైంది. భానుస్వరూప్ ఆరు, గౌతమ్ రెండు వికెట్లు తీశాడు.

‘అన్నా’..ఇవేం పనులు!

- అన్న క్యాంటీన్ భవనానికి రూ.12 లక్షలతో మరమ్మతులు
- హడావుడి పనులతో పైపై పూతలు
- ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరువు



మరమ్మతులు చేస్తున్న అన్న క్యాంటీన్



సరిగ్గా లేని ఇటుకల అమరిక

విశాఖ విద్య: గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు 15న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జీవీఎంసీ అధికారులు హడావుడిగా పనులు చేయిస్తున్నారు.దీంతో పనుల నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. పైపై పూతలతో ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావడానికి ప్రస్తుతం మరమ్మతులు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

2018 జులై 28న అప్పట్లో అన్న క్యాంటీన్ కోసం



బాగున్న రేకులను తొలగించి పడేశారిలా...

ఇక్కడ భవనం నిర్మించారు. దీనికి ప్రస్తుతం మరమ్మతుల కోసం రూ.12 లక్షలు కేటాయించారు. ఆరేళ్ల కాలంలోనే ఈ భవనం ఆధునికీకరణకు ఇంత పెద్ద మొత్తంతో మరమ్మతులు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్న క్యాంటీన్ భవనానికి సోకుల కోసం పైపై పూతలు వేసేందుకు ఇలా ప్రజాధనం వృథా చేయడమేంటని పలువురు అంటున్నారు. గతంలో ఉన్న ఫ్లోరింగ్ తొలగించి,మళ్లీ అవే ఇటుకులతో ఫ్లోరింగ్ చేశారు. ఇటుకుల మధ్య గ్యాప్‌ను సరిగ్గా పూడ్చక పోవడంతో వాటిపై నడిస్తే ఊగుతున్నాయి. గోడలకు ప్రస్తుతం ఉన్న రేకులను తీసేసి, ఏసీపీ ప్లాడింగ్ రేకులు అమర్చుతున్నారు.

పనులు ఇలా..

గోపాలపట్నం రైతు బజార్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతులకు రూ.7 లక్షల వరకు ఖర్చు చేస్తుండగా, 90వ వార్డులోని పశు వైద్యశాల వద్ద క్యాంటీన్‌కు ఏకంగా రూ.12 లక్షలు వెచ్చిస్తుండడం గమనార్హం. కమీషన్ల కోసమే ఇలా పైపై పూతలు వేస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు ఈ నెలాఖరునాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో హడావుడిగా చేస్తున్నారు. దీంతో నాణ్యత ప్రమాణాలకు తూట్లు పడుతున్నాయి. ఉన్నతాధికారులు పనులపై పరిశీలన చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

పర్యవేక్షణ చేస్తున్నాం

అన్న క్యాంటీన్ భవనం పాడైంది. గతంలో ఉన్న మోటార్, ఇతర ఎలక్ట్రిల్ సామగ్రి ఎవరో ఎత్తుకుపోయారు. మళ్లీ వాటన్నింటినీ వేస్తున్నాం. అందువల్లే రూ.12 లక్షలకు ప్రతిపాదనలు చేశాం. పనులు పూర్తి అయ్యాక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే బిల్లులు చెల్లిస్తాం.

– వెంకటలక్ష్మి, ఏఈ, జీవీఎంసీ జోన్–8

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. 58వ వార్డు పిలకవానిపాలెంలో సోమవారం వివిధ విభాగాల అధికారులతో కలిసి పారిశ్రామిక ప్రాంతంలోని సమస్యలపై వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 40,58,59,60,61,62,63వ వార్డుల్లోని పలు ప్రాంతాల ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలపై వివిధ విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని గణబాబు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ కృష్ణ, ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి,ఈఈ వేణుగోపాల్,డీఈ ఏడుకొండలుతో పాటు టీడీపీ,జనసేన పార్టీల నాయకులు కోరాడ శ్రీను,దినకర్,రామ్మోహన్‌నాయుడు,శీరం ఉమామహేశ్వరి,మూర్తియాదవ్, అంగ దుర్గాప్రశాంతి,పోతబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో సోమేశ్వరరావు



హాజరైన ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు

- మత్తుబారిన పడనీయొద్దు
- పాఠశాలల్లో క్లబ్‌ల ఏర్పాటు
- గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు

విశాఖ విద్య: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా కంటికి రెప్పలా చూసుకోవాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో ఎన్‌ఏడీలోని సెయింట్ ఆన్స్ స్కూల్లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కొన్ని చోట్ల విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారనే ఫిర్యాదులతో ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో ‘స్టూడెంట్ క్లబ్’లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నిర్వహించే అన్ని పాఠశాలల్లో క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. చదువుతో పాటు సామాజిక దృక్పథం కలిగిన 20 నుంచి 25 మంది విద్యార్థులను క్లబ్ సభ్యులుగా ఎంపిక చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణం, అదే విధంగా ప్రహరీలకు ఆనుకొని నిర్వహించే దుకాణాల వద్ద విద్యార్థులు ఎలా ప్రవర్తిస్తున్నారో క్లబ్ సభ్యులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. తరగతి ఉపాధ్యాయుడు దీని బాధ్యత తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు సమీక్ష చేయాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే సకాలంతో తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్లబ్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర నివేదికలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈవో-2 దివాకర్, ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు ఎక్కువగా ఉందంటూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, పారిశుధ్య సమస్యపై పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు తారా, ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మచ్చేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు తండ్రి మచ్చేశ్వరరావు చిత్రపటం వద్ద డిప్యూటీ మేయర్ నివాళులర్పించారు. ఆయన పెద్ద కర్మ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. కుమారుల అభివృద్ధిలో మచ్చేశ్వరరావు పాత్ర ఎంతో ఉందని కొనియాడారు.

11న ప్రతిభావంతులకు పురస్కారాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి

మల్కాపురం: ప్రతిభ క్రీడా,సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను ఆగస్టు 11న సత్కరించి అవార్డులు ప్రదానం చేయనున్నట్టు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు, ప్రోగ్రాం కన్వీనర్ వగ్రే నాంచారయ్య మాట్లాడుతూ ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆరోజు ఉదయం 9 గంటల నుంచి ఈ అవార్డుల ప్రదానోత్సవం చేయనున్నట్టు చెప్పారు.

‘శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి’



మాట్లాడుతున్న శిష్ట కరణం అధ్యక్షుడు గోపీ

అగనంపూడి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సహకారం అందించాలని శిష్ట కరణం అసోసియేషన్ కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎస్‌వి గోపాల్, డి.సత్యారావు కోరారు. వడ్లపూడి కాలనీలో సోమవారం నిర్వహించిన కూర్మన్నపాలెం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గురునాథరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కె.రవినాథ్, ఎన్.నాగభూషణం, రాము, కిషోర్ కుమార్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ పత్రాల భద్రత ఇలాగేనా!



కార్యాలయ మెట్లపై ఉంచిన రెవెన్యూ పత్రాలు



సంచుల్లో కనిపిస్తోన్న ఫొటోతో కూడిన దరఖాస్తులు

విశాఖ విద్య: గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పత్రాలను సంచుల్లో పెట్టి మెట్లపై వదిలేశారు. ఇందులో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించిన పత్రాలు కూడా కనిపిస్తున్నాయి. పోలింగ్ ఏజెంట్లకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చేవారు మెట్లపై ఉన్న వాటిని ఇవేం కాగితాలు అంటూ చూస్తున్నారు. ఒక వేళ ఆ పత్రాలతో పని లేకున్నా, వాటిని ఇతరులకు కనిపించకుండా ఉంచాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉంది. కానీ ఈ విషయంలో కార్యాలయ సిబ్బంది తమకేమీ పట్టనట్లు ఉన్నారు. ఇలాంటి నిర్లక్ష్యంపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు ఊపిరి తీయొద్దు



దీక్షలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఊపిరి తీయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జి.బోసుబాబు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1264వ రోజు, సోమవారం కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూడున్నర సంవత్సరాల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తుంటే రోజురోజుకూ ఉక్కును ఇరకాటంలో పెట్టడం, ఉత్పత్తికి విఘాతం కల్గించడం చేస్తుండడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షిస్తామని రాష్ట్రంలో నాయకులు హామీ ఇచ్చారని, ఆ మేరకు ఉక్కు పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస నాయుడు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, డేవిడ్, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

రక్త నిల్వల జాబితా ప్రదర్శించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రక్త నిల్వల జాబితా, వివరాలు ప్రతి బ్లడ్ బ్యాంకులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఉన్న బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో కనీసం రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. హెపటైటిస్-బి, సి పాజిటివ్ కేసులు, హెచ్ఐవీ, సిఫిలిస్ కేసుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా కేసులకు ఉచితంగా రక్తం సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల నిర్వహణకు లైసెన్స్, శిబిరాల నిర్వహణకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక తగిన స్థాయిలో ప్లేట్‌లెట్లను ప్రతి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి బ్లడ్ లేదంటూ నిరాకరించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్టు నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, సహాయ అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు బద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుక గూళ్లు కాదు.. విద్యుత్ తీగలే..



మల్కాపురం యాదవవీధిలో...



ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంటి ముందు ప్రమాదకరంగా..

- భవనాలకు ఆనుకుని విద్యుత్ వైర్లు
- వర్షాకాలం కావడంతో ఆందోళనలో నివాసితులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని పలు వీధుల్లో భవనాలకు ఆనుకుని విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఆ యా భవనాల యజమానులు, నివాసితులు భయాందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి : జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురంలో వీధులు ఇరుగ్గా ఉంటాయి.ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది కరంగా ఉండే వీధుల్లో ఆ ప్రాంత నివాసీయుల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు సీసీ, ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. వాటికి ఎల్‌టీ విద్యుత్ వైర్లు అమర్చారు. ఈ స్తంభాలకే నివాసీయులు తమ తమ ఇళ్ల విద్యుత్ వైర్లు అమర్చుకుని విద్యుత్ అవసరాలు తీర్చుకుంటారు.ఇంత వరకు బాగానే ఉన్నా రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్తంభాలకు ఇనుప యాంగిలర్స్ అమర్చి వాటి ద్వారా ఎల్‌టీ లైన్లు, సర్వీసు వైర్లు అమర్చాలి. ఇలా అయితే వైర్లు ఇక్కడ భవనాలకు రాసుకోవు. అయితే అధికారులు అలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వైర్లు భవనాలకు రాసుకుంటున్నాయి. విద్యుత్ వైర్లు తడిసిన భవనాలకు రాసుకుంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని భవన యజమానులు ఆందోళన చెందుతున్నారు. సమస్యపై అధికారులు స్పందించాలని మల్కాపురం,ప్రకాష్‌నగర్ తదితర ప్రాంత నివాసీయులు కోరుతున్నారు.

పదేళ్లుగా సమస్య పరిష్కారం కాలేదు

జీవీఎంసీ కమిషనర్ ముందు బైఠాయించిన మహిళ



కమిషనర్ ముందు సమస్య వివరిస్తున్న బాధిత మహిళ

డాబాగార్డెన్స్: మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జయలక్ష్మి అనే మహిళ తన ఆవేదనను చెప్పుకునేందుకు వచ్చారు. బీఆర్‌టీఎస్ పుణ్యమా అంటూ తమ భూమి తీసుకున్నారని, టీడీఆర్‌లు ఇస్తామన్నారని తెలిపారు. రోడ్డు విస్తరణలో ఎన్ఏడీ వద్ద ఏడుగురి ఇళ్లు జీవీఎంసీ తీసుకుందని, ఐదుగురికి డబుల్ టీడీఆర్‌లు అప్పటి ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా అందజేశారన్నారు. భూమి తన భర్త పి.వెంకట నారాయణ (అడ్వకేట్) పేరుపై ఉందని పేర్కొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే గణబాబు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జీవీఎంసీ చుట్టూ గత పదేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. గత కమిషనర్ రాజాబాబు (సాయికాంత్ వర్మకు ముందు) స్పందించారు. మూడు రోజుల్లోనే సింగిల్ టీడీఆర్ ఇప్పించారు. భూమి కోల్పోయిన ఏడుగురిలో ఐదుగురికి డబుల్ టీడీఆర్‌లు ఇచ్చారని, తనకు సింగిల్ టీడీఆర్ ఇవ్వడమేంటని ప్రశ్నించానన్నారు. దీంతో సీసీపీని కలవాలని కమిషనర్ ఆదేశించారన్నారు. అయితే తన సమస్య మాత్రం పరిష్కారం కాలేదని తెలిపారు. కమిషనర్ సంపత్‌కుమార్ బదులిస్తూ ఫైల్ చూసి పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో ఆమె ఆగ్రహావేశాలకు గురై ప్రతి సోమవారం వచ్చి ఫిర్యాదు ఇచ్చి వెళ్లపోవడం తప్ప ఇక్కడ ఏ అధికారికి బాధ్యత లేదా? అంటూ మేయర్, కమిషనర్ ముందు బైఠాయించారు. కమిషనర్ స్పందిస్తూ మధ్యాహ్నం 3 గంటలకల్లా ఆమె సమస్య పరిష్కరిస్తామన్నారు. మూడు గంటలకు సీసీపీ కార్యాలయానికి వెళ్లాలని బాధిత మహిళకు చెప్పారు. ఆమె వెళ్తే టీడీఆర్ సిద్ధం చేశామని, కమిషనర్‌కు కాపీ అందజేసిన తర్వాత అందజేస్తామని చెప్పినట్లు బాధిత మహిళ జయలక్ష్మి పేర్కొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కరపత్రం, పోస్టర్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామ మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎల్.మహేంద్రనాథ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



బస్సులో ప్రయాణిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తన బంగ్లా నుంచి బ్యాటరీ వాహనంలో జీవీఎంసీకి వచ్చారు. అనంతరం వారిద్దరూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.